క్లుప్తంగా

కళాశాలలో ఆన్‌లైన్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు



అయిజ: ఈవిద్యా సంవత్సరానికి తెలంగాణ ప్రభుత్వం పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ అప్‌లై చేసుకోవడానికి అనుమతి ఇవ్వడంతో కళాశాల ప్రిన్సిపాల్ రాములు కళాశాలలోనే ఆన్‌లైన్‌లో స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. దీంతో బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు స్కాలర్ షిప్ కోసం దరఖాస్తు చేసుకున్నారు.

స్వామిని దర్శించుకున్న రంజిత్‌కుమార్



కేటీదొడ్డి: మండల కేంద్రంలోని గుడికల్ అలీ పీర్ స్వామిని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ బుధవారం దర్శించుకున్నారు. స్వామి వారికి పూలమాల, శాలువాతో సన్మానించారు. స్వామి ఆశీస్సులు ఎల్లప్పుడూ ప్రజలకు ఉండాలని వారు కోరారు. వారి వెంట అంజి, భీమన్‌గౌడు, రేణప్ప, జ్ఞానేశ్వర్, ఏసు, దస్తగిరిగౌడు, సుభాన్, గజేంద్ర, భాస్కర్, ఉన్నారు.

ప్రిన్సిపాల్‌కు సన్మానం



మల్దకల్: రాష్ట్ర స్థాయి ఉత్తమ ప్రిన్సిపాల్‌గా అవార్డు అందుకున్న రమేష్‌లింగంను బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. కళాశాలకు మంచి పేరు తెచ్చిన ప్రిన్సిపాల్‌ను వారు అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామాంజనేయులుగౌడ్, నర్సింహులు, శివకుమార్, గోవర్ధన్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థికి ఘన సన్మానం



గద్వాల అర్బన్: జిల్లా కేంద్రానికి చెందిన మాకం దినేష్, మహేష్‌లు ఎంబీబీఎస్ పూర్తి చేసి పీజీ మెడికల్ సీటు సాధించడంతో వారిని బుధవారం పద్మశాలి సంఘం కన్వీనర్ నర్సింహులు, కో కన్వీనర్ శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, పద్మశాలీ సంఘం నాయకులు బాలరాజ్, నాగరాజు, భీమేష్, శంకర్, రాజశేఖర్ ఉన్నారు.

కాటికాపరులకు పెన్షన్, బీమా అందించాలి

ఉండవెల్లి: కాటికాపరులకు పెన్షన్, బీమా సౌకర్యం కల్పించాలని బుధవారం మండల కేంద్రంలోని సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీరెడ్డికి కాటికాపరుల సంఘం జాతీయ వ్యవస్థాపకుడు బ్యాగరి కేశవులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో కాటికాపరులు శ్మశాన వాటికలో విధులు చేస్తున్నా వారిని గుర్తించడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కాటికాపరులకు పెన్షన్, ప్రమాద బీమా, ఇతర పథకాలు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చిన్న ఆముదాలపాడు సర్పంచ్ నాగేష్, కాటికాపారుల సంఘం నాయకులు మద్దిలేటి, వెంకటేష్, మధుబాబు పాల్గొన్నారు.

ఓటరు నమోదును ప్రోత్సహించండి

• ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి చంద్రకళ



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి చంద్రకళ

అలంపూర్: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవడానికి రాజకీయ పార్టీల నాయకులు ప్రోత్సహించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి చంద్రకళ అన్నారు. అలంపూర్ చౌరస్తా వ్యవసాయ మార్కెట్ యార్డులోని సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలను రాజకీయ పార్టీలకు చదివి వినిపించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలన్నారు. ఎంపీడీఓల వద్ద ఓటర్ జాబితాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జాబితాలో యువతీ యువకుల పేర్లు పరిశీలించి లేని వారిని కొత్తగా నమోదు చేయించాలన్నారు. గ్రామాల్లో ఉన్న రాజకీయ పార్టీల నాయకులు బీఎల్‌ఓలకు సహకరించాలన్నారు. ఓటర్ జాబితాలో అనుమానాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల నాయకులు కిషోర్, దేవన్న తహసీల్దార్లు మంజుల, జ్యోతి, షాహిదాబేగం, మైనొద్దీన్, శ్రీనివాసజోషి, వెంకటేశ్వర్లు, డీటీ జయంతి, ఎంపీడీఓలు, బీఎల్ ఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అయిజ: మున్సిపాలిటీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మున్సిపల్ మేనేజర్ రాజేష్ కుమార్, ఏఈ గోపాల్ యువ మహిళా ఓటరు నమోదుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఎల్‌ఓలు, ఆశ కార్యకర్తలు సమన్వయంతో ప్రతి ఇంటికీ వెళ్లి ఓటరుగా నమోదుకాని యువ మహిళలకు ఓటు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ లక్ష్మన్న, జూనియర్ అసిస్టెంట్ విజయ్, బిల్ కలెక్టర్లు నరేష్, నాగరాజు, మహేంద్రనాథ్, అడివన్న, ఆంజనేయులు, వీరేష్, ప్రకాష్, రాకేష్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



డీఈఓకు వినతి పత్రం ఇస్తున్న కార్మికులు

గట్టు: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న వంట ఏజెన్సీ నిర్వాహకులకు మధ్యాహ్న భోజన పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని బుధవారం కలెక్టర్ వల్లూరుక్రాంతి, జిల్లా విద్యాధికారి మహ్మద్ సిరాజుద్దీన్‌లకు వినతి పత్రాలు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన వంట కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు శేషన్న, వంట కార్మికులు బాషా, తిమ్మప్పలు కలెక్టర్, డీఈఓలకు వినతి పత్రాలు సమర్పించారు. మార్చి నుంచి ఏప్రిల్ వరకు, జూన్ నుంచి ఆగస్టు వరకు పెండింగ్‌లో ఉన్న 5నెలల మధ్యాహ్న భోజన బిల్లులు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా జెడ్పీ చైర్‌పర్సన్ జన్మదిన వేడుకలు



గద్వాల అర్బన్: జెడ్పీ చైర్‌పర్సన్ సరిత జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో రాఘవేంద్ర కాలనీలోని అంధుల ఆశ్రమ పాఠశాల విద్యార్థుల మధ్య కేక్‌కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



కస్తూర్బాలో వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ జయమ్మ

మల్దకల్: ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని ఆయుర్వేదిక్ డాక్టర్ జయమ్మ విద్యార్థులకు సూచించారు. బుధవారం మల్దకల్ కస్తూర్బా బాలికల పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్‌గా వచ్చే వ్యాధులపై బాలికలు అప్రమత్తంగా ఉండాలన్నారు. బాలికలు వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పోషకాలు ఉండే ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది మహేశ్వరి, రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ సేవలు మరువలేనివి



ఎర్రవల్లిచౌరస్తా: తెలుగు రాష్ట్రాల్లో పేదల అభివృద్ధి కోసం ఎన్టీఆర్ చేసిన సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఇటిక్యాల మండలంలోని బీచుపల్లిలో ఎన్టీఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. భారత ప్రభుత్వం ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా గౌరవార్థం రూ.100 నాణలపై ఎన్టీఆర్ బొమ్మ ముద్రించిందన్నారు. ఈ సందర్భంగా అభిమాన సంఘాల నాయకులకు ఆ నాణలను ఆయన పంపిణీ చేశారు. తెలుగు భాషకు, తెలుగు జాతికి దేశవ్యాప్తంగా గుర్తింపు తేవడం కోసం ఎన్టీఆర్ ఎంతో కృషిచేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, రాజశేఖర్, అశోక్, వెంకటయ్య, గౌస్, ఎన్టీఆర్ అభిమాన సంఘాల నాయకులు ఉన్నారు.

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిరసన



బతుకమ్మ ఆడుతూ నిరసన తెలుపుతున్న ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

గద్వాల అర్బన్: నేషనల్ హెల్త్ మిషన్ స్కీం కింద పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని రాజీవ్‌మార్గ్‌లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సమ్మె నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం సమ్మె శిబిరంలో ఉద్యోగులు బతుకమ్మ ఆడుతూ నిరసన తెలిపారు. సమ్మెకు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు హాజరై మాట్లాడారు. 20ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా ల్యాబ్‌టెక్నిషియన్, పీహెచ్‌ఎం, అకౌంటెంట్ డీఈఓ, పీహెచ్‌సీలుగా పని చేస్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే వారందరిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హనుమంతు, నర్సింహులు, పరశురాముడు, హరిప్రసాద్, పుష్ప ఉన్నారు.

9న జాతీయ లోక్ అదాలత్

గద్వాల క్రైం: ఈ నెల 9వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవా అధికారిత సంస్థ చైర్మన్, జిల్లా న్యాయమూర్తి కె కుష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ స్టేషన్లలో న మోదైన కేసుల పరిష్కారం కోసం కక్షి దారులు రాజీమార్గంలోపరిష్కరించుకోవాలని పేర్కొన్నారు.



కర్ణాటక నుంచి మల్దకల్‌కు కూలీలను తరలిస్తున్న ఆటో



అయిజ నుంచి మల్దకల్‌కు కూలీలను తరలిస్తున్న బొలెరో వాహనం

ప్రయాణం-ప్రమాదం

• పరిమితికి మించి వాహనాల్లో తరలింపు

మల్దకల్: ప్రమాదకరంగా ప్రయాణాన్ని కొనసాగిస్తూ ప్రైవేట్ వాహనాల డ్రైవర్లు, ప్రయాణికులు నిర్లక్ష్యం వీడడం లేదు. కూలీలు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించడంతో వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కర్ణాటకలోని వివిధ గ్రామాల కూలీలతో పాటు గద్వాల, ధరూరు, గట్టు ప్రాంతాల నుంచి గూడ్స్ వాహనాలు, ప్యాసింజర్ వాహనాల్లో పరిమితికి మించి కూలీలను తరలిస్తున్నారు. 7గురు ఎక్కాల్సిన ఆటోలో 12 నుంచి 15మందిని చేరవేస్తున్నారు. చిన్నపాటి ప్రమాదాలు జరిగినా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది.

నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు..

గూడ్స్ వాహనాల్లో ప్రయాణికులను చేరవేసి నిబంధనలను ఉల్లంఘిస్తే వారిపై కేసులు నమోదు చేస్తాం. డ్రైవర్ల లైసెన్స్‌లు రద్దుచేయడంతో పాటు వారిపై కేసులు నమోదు చేస్తాం. – కల్యాణ్‌కుమార్, ఎస్‌ఐ మల్దకల్

కళాశాల ఏర్పాటు చేస్తే బాలికలకు భవిష్యత్



కళాశాల కోసం ర్యాలీ చేస్తున్న ఉర్దూ పాఠశాల విద్యార్థులు

రాజోళి: మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తేనే బాలికల విద్యకు అవకాశాలుంటాయని కాలేజీ సాధన సమితి సభ్యులు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఉర్దూ పాఠశాల విద్యార్థులతో కలిసి కాలేజీ ఏర్పాటు చేయాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలేజీ లేకపోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకునే అవకాశం లేక చాలా మంది విద్యార్థులు పదో తరగతిలోనే చదువు మానేస్తున్నారన్నారు. బాలికల పరిస్థితి ఇబ్బందికరంగా మారుతోందన్నారు. అధికారులకు, నాయకులకు ఎన్నో సార్లు వినతి పత్రాలిచ్చినా ప్రయోజనం లేదన్నారు. ఇప్పటికైనా విద్యార్థులకు అందుబాటులో కాలేజీ ఏర్పాటు చేసి వారి భవిష్యత్‌కు బాటలు వేయాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల సాధన సమితి కన్వీనర్ గాజుల ఈశ్వరయ్య, సతీష్, నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

టికెట్ ఇస్తే గెలిచి చూపిస్తాం



నసనూరులో ప్రేమలతకు మద్దతుగా సమావేశంలో మాదాసి కురువలు

రాజోళి: బీఆర్‌ఎస్ పార్టీ తరుపున తమకు టికెట్ ఇస్తే గెలిచి చూపుతామని మాదాసి, మాదారి కురవ సంఘం సభ్యులు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని నసనూరులో వారు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రేమలతకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామన్నారు. గడిచిన ఎన్నికల్లో నామినేషన్ వేసినప్పటికీ అధిష్టానం ఆదేశాల మేరకు నామినేషన్ ఉపసంహరించుకున్న ప్రేమలతకు ప్రస్తుత ఎన్నికల్లో టికెట్ ఇస్తే తప్పక గెలిపిస్తామన్నారు. అలంపూర్ నియోజకవర్గంలో మాదాసి, మాదారి కురవల ఓటు బ్యాంకు ఎక్కువ ఉందని, వాటితో పాటు ఎస్సీ సామాజికవర్గానికి చెందిన ఓట్లన్నీ తమ వైపే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రేమలత, పల్లయ్య, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ అసెంబ్లీ టికెట్ కోసం దరఖాస్తు



బీజేపీ టిక్కెట్ కోసం దరఖాస్తు పత్రాన్ని అందజేస్తున్న కుర్వ చిన్నమల్లయ్య

అలంపూర్: బీజేపీ అభ్యర్థిగా అసెంబ్లీ టికెట్ కోసం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం అలంపూర్ బీజేపీ సీనియర్ నాయకులు కూడవెల్లి మాదాసి కుర్వ చిన్న మల్లయ్య దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు బీజేపీ మండలాల అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి, శేఖర్, పట్టణ అధ్యక్షుడు నాగమల్లయ్య, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి పరుశురాం, బూత్ అధ్యక్షులు పులేందర్, హేమంత్ కుమార్‌లు హైదరాబాద్ వెళ్లారు.

బీసీలకు 60 శాతం సీట్లు ఇవ్వాలి



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న బీసీ సంఘం నాయకులు

గద్వాల అర్బన్: అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 60 శాతం ఎమ్మెల్యే సీట్లు, సీఎం పదవి ఇవ్వాలని బీసీ సంఘం రాష్ట్ర నాయకులు అచ్చన్నగౌడ్, మధుసూదన్ బాబు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సామాజిక న్యాయం, సబ్బండ కులాలకు రాజ్యాధికారం దక్కాలని ఈనెల 10న సరూర్‌నగర్ స్టేడియంలో బీసీల సింహగర్జన సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. సమావేశంలో వెంకట్ రెడ్డి, వాల్మీకి, వినోద్ కుమార్, దామోదర్, గోపాల్ రావు, ఉస్సేన్, దానయ్య, నాగన్న, ఆంజనేయులు, మోహన్ బాబు ఉన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్ ఇందిర

గట్టు: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వైస్ ఎంపీపీ సుమతి, సూపర్‌వైజర్ వాసంతిలు తెలిపారు. పోషణ మాసంలో భాగంగా బుధవారం బోయలగూడెం 1,2,3 అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆలూరు గ్రామంలోని 4వ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ లోపాలను అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అంగన్‌వాడీ టీచర్ ఇందిర గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. చిన్నారుల్లో పోషక లోపాలను అధిగమించేందుకు గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం కృష్ణాష్టమి సందర్భంగా చిన్నారికి కృష్ణుడు, గోపిలక వేషధారణ వేయించి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో బోయలగూడెం అంగన్‌వాడీ టీచర్లు అరుణ, మల్లమ్మ, రామేశ్వరమ్మ, ఆలూరు అంగన్‌వాడీ టీచర్ ఇందిరమ్మ, ఆయా లలితతో పాటుగా పిల్లల తల్లిదండ్రులు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

'సమగ్ర శిక్ష' కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



గద్వాలలో దీక్ష చేపట్టిన సమగ్ర శిక్ష ఉద్యోగులు

గద్వాల: జిల్లాలోని విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులను తక్షణం క్రమబద్ధీకరించాలని, తమ ఉద్యోగ జీవితాలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు చేపట్టిన రిలే దీక్షలు రెండో రోజు కొనసాగాయి. బుధవారం జిల్లా కేంద్రంలో చేపట్టిన దీక్ష శిబిరంలో మహిళా ఉద్యోగులు ఎమ్మెల్సీ కవిత చిత్రపటానికి వడిబియ్యం నింపి, సీఎం కేసీఆర్‌కు తమ సమస్యలు విన్నవించాలంటూ వేడుకున్నారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు హుసేనప్ప, గోపాల్ మాట్లాడారు. కేజీబీవీ సీఆర్‌టీలు, సీఆర్పీలు, డీఎల్‌ఎంటీ, సీసీఓ, పీటీఐ, యూఆర్‌ఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ న్యాయం చేయాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగినులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయ సంఘ నేత మోహన్ వారికి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

కనుల పండువగా కృష్ణాష్టమి వేడుకలు



గద్వాలలో కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారులు

గద్వాల: జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్ విద్యాసంస్థల్లో ముందస్తుగా శ్రీకృష్ణాష్టమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎస్ఆర్ విద్యానికేతన్, విశ్వభారతి, కాకతీయ, విశిష్టనోబుల్, ఇండో ఇంగ్లిష్, మాంటిస్సోరి, దయనంద విద్యామందిర్, విశ్వేశ్వరయ్య హైస్కూల్, ప్రగతి విద్యానికేతన్ తదితర పాఠశాలల్లో ప్రత్యేకంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించి సంస్కృతిని చాటి చెప్పారు. పలు పాఠశాలల్లో ఉట్లను ఏర్పాటు చేసి చిన్నారి కృష్ణుల చేత కొట్టించారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఆయా గ్రామాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రవల్లి ఏకశిల, సరస్వతి పాఠశాలలో విద్యార్థులు శ్రీకృష్ణునిగా, విద్యార్థినీలు గోపికల వేషధారణలో అలరించారు. పాఠశాలల ఆవరణలో చిన్నారులతో ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఎర్రవల్లి చౌరస్తాలో శ్రీకృష్ణుని విగ్రహానికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం కృష్ణుని పల్లకీపై పురవీధుల్లో ఊరేగించారు.

ధరూరు: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మి కాన్సెప్ట్ స్కూల్, మాల్‌దొడ్డి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికలు, సత్యభామ వేషధారణలో అలంరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అయిజ: మండల కేంద్రంలో, వివిధ గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎక్లాస్‌పురంలో శ్రీకృష్ణుడి విగ్రహానికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శాంతినగర్: వడ్డేపల్లి పురపాలిక, మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ప్రారంభమయ్యాయి. వడ్డేపల్లి గట్టుపై శ్రీవసంత మాధవస్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఉట్టికొట్టేకార్యక్రమం నిర్వహించారు.

ఉండవెల్లి: కంచుపాడులో కృష్ణుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. తక్కశిలలో కృష్ణుడి విగ్రహాలు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు.



అయిజలో ఉట్టి కొడుతున్న విద్యార్థులు



ఎక్లాస్‌పురంలో..



ధరూరులో..



ఎర్రవల్లిలో..



రాధాకృష్ణుల వేషధారణల్లో చిన్నారులు



తక్కశిలలో..

సైబర్ నేరాలపై అవగాహన

మానవపాడు: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ రాము తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు జరుగకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరగాళ్లు రోజుకో రీతిలో ప్రజలను మోసం చేసి డబ్బులు కాజేస్తున్నారన్నారు. ఆన్‌లైన్ ద్వారా లావాదేవీలు నడిపేవారు కొత్త వ్యక్తుల మాటలను నమ్మొద్దని, తెలియని మెసేజీలపై క్లిక్ చేయ రాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ తిప్పన్న, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 97051 35557
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 95539 55603
జోగుళాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com